


# భవానీదేవి

కొరడా అశోకవర్ధన్

ఆ చివరిఫైలు సంతకంచేసేసి, గడియారం చూసుకుంది భవానీదేవి. టైము ఆరూ నలభై దాటింది. అంటే మామూలుగా ఆఫీసు అయిపోయి గంటన్నర అయిందన్నమాట.

ఫైళ్లు చూసి చూసి అలసిపోయిన భవానీదేవి ఒక్కసారి ఒళ్లు విరుచుకుంది అలసిపోయినట్టు. బెల్ కొట్టింది. ఖాకీ యూనిఫారంలో అటెండర్ స్ప్రింగ్‌డోర్ తెరుచుకునొచ్చి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు, ఆజ్ఞలకోసం. "కారు రెడీగా ఉందా చూడు" అంది. "ఎస్.మేడమ్?" అంటూ గబగబా వెళ్లిపోయాడు వాడు. రెండునిమిషాల్లో తిరిగొచ్చి, 'రెడీగా ఉంది మేడమ్' అన్నాడు. భవానీదేవిలేచి నుంచుంది. "ఈ ఫైల్స్‌ని ఇంటికి పంపించాలా మేడమ్" అడిగాడు వాడు. "ఒద్దు శంకర్. ఇవ్వాళ సాయంత్రం నాకు హోటల్ బంజారాలో డిన్నరుంది. ఫైల్స్ ఇక్కడే వుండనీ. రేపు పొద్దున్నే వొచ్చి చూస్తాను" అంది డోరు తెరుచుకుని వెళ్తూ. శంకర్ ఫైల్స్ అన్నీ అలమారలో పెట్టి తాళం పెట్టి, గబగబా భవానీదేవి వెనకాలే పరుగెత్తుకొచ్చాడు. "నేనూ రావాలా మేడమ్" చేతులు కట్టుకుని వినయంగా నుంచుని అడిగాడు. భవానీదేవి ఒక్క నిమిషం ఆలోచించి, "అక్కర్లేదులే. నువ్వెళ్లిపో" అంది. డ్రైవర్ డోరు తెరిచి నుంచున్నాడు. భవానీదేవి కారెక్కింది. డోరు వేసేసి, స్టీరింగ్ దగ్గర కూర్చుంటూ "ఎక్కడికి వెళ్లాలి మేడమ్" వినయాన్నంతా గొంతులోనే ఒలకబోస్తూ అడిగాడు డ్రైవర్. "ముందు ఇంటికి పోనీ ఖాదర్" అంది.

"అలాగే మేడమ్" అంటూ కారుని బంజారా హిల్స్ వైపు పోనిచ్చాడు. ఖాదర్ తురకవాడే అయినా, విజయవాడలో పుట్టి పెరగడంవల్ల, తెలుగు తెలుగువాళ్లకన్నా స్వచ్ఛంగా మాట్లాడతాడు.

బంజారాహిల్స్ రోడ్డు నంబరు పందొమ్మిదిలో అరవైనాలుగో ఇంటిముందుకారాగింది. కారు చూడగానే వాచ్‌మన్ గేట్లు బార్లా తెరిచాడు. కారు లోపలికి తీసికెళ్లి పోర్టికోలో ఆపాడు డ్రైవర్. భవానీదేవి దిగేలోగా, ఖాదర్ గబగబా కారు దిగి భవానీదేవికి 'డోరు' తెరచి పట్టుకున్నాడు. పనిమనిషి ఎదురొచ్చి, ఆమె చేతిలోని హేండుబ్యాగునందుకుని, నమస్కరించి లోపలికెళ్లింది. భవానీదేవి తన గదిలోకి వెళ్లింది.

ఖాదర్ కారు తుడుస్తున్నాడు. తోటమాలి వీరయ్య చెట్లకు నీళ్లు పోస్తున్నాడు పెద్దపైపుని అటూఇటూ తిప్పుతూ. ఆ భవంతి గోడలనానుకుని ఏపుగా ఎదిగిన అశోకచెట్లు, అటూ ఇటూ ఊగిపోతున్నాయి గాలికి, ఆనందంతో పరవశించిపోతున్నట్టు. పందిళ్లకి నిండుగా ఎగబాకిన జాజి, చేమంతిలు, తొట్లలో నిండుగా పూసిన, రంగురంగుల గులాబీలూ, మొగ్గతొడిగి పూతకు సిద్ధంగా ఉన్న చామంతులూ, గుత్తులు గుత్తులుగా విరగబూసిన కనకాంబరాలూ, కొత్త చిగుళ్లతో నిగనిగలాడుతూన్న రకరకాల క్రోటన్లూ, ఆ పూతోట, అధునాతన కట్టడంతో అందంగా ఉన్న ఆ ఇంటికి మరింత అందాన్నిస్తున్నాయి. వెల్‌వెట్ కర్టెన్లని తోసుకుంటూ ముచ్చటగా మూడు బొచ్చుకుక్కలు వరండాలో కొచ్చి, ఒకదానితో ఒకటి ఎంతో సఖ్యంగా ఆడుకుంటున్నాయి.

'ఇంటిమేట్' సెంటువాసన గుప్పుమని అలుముకుంది ఆ ఆవరణలో గబగబా ఖాదర్ పరుగెత్తుకుంటూ వెళ్లి కారు డోరు తెరిచాడు. అప్సరసలా అతి వయ్యారంగా కారెక్కి కూర్చుంది భవానీదేవి. డోరు వేసొచ్చి కారు స్టార్టుచేస్తూ ఆమెకేసి తిరిగి చూశాడు ఖాదర్. 'హోటల్ బంజారా" అంది ఆమె.

నేవీ బ్లూ షిఫాన్ చీరమీద వెండి చమ్‌కీ పని తళతళా మెరిసిపోతోంది. చెవులకున్న వజ్రాల దుద్దులూ, మెళ్లోని వజ్రాలహారం, నవరత్నాల ఉంగరం ఒకదానితో ఒకటి పోటీపడి మెరిసిపోతున్నాయి. పచ్చగా నిగనిగలాడే ఆమె మేనుకి కొత్త కాంతులు విరజిమ్ముతూ మరింత అందంగా కనిపింపజేస్తున్నాయి. నల్లని కాటుక కళ్లూ, ఎర్రటి లిప్‌స్టిక్‌తో ధగధగా మెరిసే పెదవులూ, విశాలమైన ఫాలభాగం ఎర్రగా గుండ్రంగా నిగనిగలాడే చిన్న కుంకంబొట్టు భవానీ దేవి అందానికి మరింత మెరుగునిస్తున్నాయి. ఎంతవారైనా ఆమెనుంచి దృష్టి మరల్చుకోవడం కష్టం.

హైదరాబాదు నగరంలోకల్లా ఎంతో ఖరీదైనదీ, అందమైనదీ హోటల్ బంజారా. ఆ హోటల్లో వున్నవారూ, ఆహోటల్ కెళ్లేవారూ, ఒక స్థాయిలో వున్నవారనీ, అంతస్తులు కలవారనీ, ఆ పేరు చెబితేనే అర్థమయిపోతుంది. అతి సుందరమైన ప్రదేశంలో, పాలరాతి కట్టడాలతో నవీనంగా కట్టబడ్డ ఆ భవనం, విద్యుద్దీపాలకాంతిలో, ఇంద్రభవనంలా మెరిసిపోతోంది. స్వదేశీ, విదేశీ మిశ్రమంతో ఆ ప్రదేశం ఇంద్రలోకంలా అనిపిస్తుంది. స్వర్గంలో లాగానే ఆడా మగా తేడా లేక అందరూ సోమపానం సేవించినట్టు 'స్కాచ్ విస్కీ'లూ, 'బ్రాందీ'లూ సేవిస్తూ అందరూ కులాసాగా వుంటారు. వారిని చూస్తుంటే 'సంతోషమంతా మూటగట్టుకుని ఇక్కడే వుండిపోయిందా' అనిపిస్తుంది.

పోర్టికోలో ఆగిన కారుచూసి, అందరూ పరుగెత్తుకొచ్చారు కారుదగ్గరికి. ఖాదర్ కారుదిగి కార్ డోరు తెరిచేలోగా, వారే డోరు తెరిచి "గుడ్ ఈవెనింగ్ మేడమ్" అంటూ నుంచున్నారు చిరునవ్వుతో. అందరినీ పేరుపేరునా పలకరించి, కొందరితో కరచాలనంచేసి, ముందుకు సాగింది భవానీదేవి.

అందరిచేతుల్లోనూ గ్లాసులు తళతళ లాడుతున్నాయి. అందరూ భవానీదేవికి శుభాకాంక్షలు చెబుతున్నారు. అక్కడున్న వాళ్లంతా ఏదో ఒక కంపెనీలో మంచి హోదాలో ఉన్న ఆఫీసర్లే. 'ఇండియా పొగాకు కంపెనీలో పౌర సంబంధాల ప్రధానాధికారి భవానీదేవి! ఆమె నెలసరి జీతం అయిదువేల రెండువందలు.

అది ప్రతి కంపెనీలోనూ ఉన్న 'పౌరసంబంధాల శాఖాధికారుల సమాఖ్య' సమావేశ కార్యక్రమం. ఆ సమాఖ్యకి ఈ సంవత్సరం భవానీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడింది. బొంబాయి టెక్స్‌టైల్ కంపెనీ నుంచి ఖన్నా ప్రసిడెంటుగా, కలకత్తా సీడ్ ఆయిల్ కంపెనీనుంచి మల్‌హోత్రా వైస్ ప్రసిడెంటుగా, మద్రాసునుంచి రాధాకృష్ణన్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. వీరిలో ఏకైక నారీమణి భవానీదేవి. ఈమె హోదా, అంతస్థు, అందం, ఆలిండియాలో అందరూ ఆకర్షితులే. ఆమె

**కళ్ళు తెరిచేసరికి భళ్ళున తెల్లారి పోయింది. అప్పటికే ఇంటిల్లిపాదీ లేచి సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. తనని చూసి అమ్మా, అత్తగారూ ముసిముసిగా నవ్వుకుంటున్నారు.....................**

చిరునవ్వుకోసం తహతహ లాడుతూ, చుట్టూ చేరతారు. ఆమె పక్కన కూర్చుని మాట్లాడుతూంటే, మేఘాల్లో తేలిపోతూన్నట్లు అనుభూతిని పొందుతారు. ఆమెకి ఏ క్షణంలో ఏం కావలసివచ్చినా, అందివ్వడానికి సిద్ధంగా, ఆ అపురూపమైన అవకాశం కోసం ఎదురుచూస్తూ, ఆమె అడుగులో అడుగు వేస్తూ చుట్టూ ఉంటారు జనం. ఆ సంగతి భవానీకి తెలుసు. వాళ్లని ఉడికిస్తూ, మురిసిస్తూ, అందీ అందనట్టు మరిపిస్తూ, వాళ్లందర్నీ బొమ్మల్ని చేసి ఆడించి, ఆనందిస్తుంది. వారి తహతహ, ఆందోళనా, ఆవేదనా చూసి గర్వంగా కక్ష తీర్చుకున్నట్లు సంతోషిస్తుంది. ఆమె గుండెలో అగ్నిపర్వతాలు బద్ధలవుతూన్నా, పైకి పన్నీటి సరోవరంలో ఈత కొడుతూన్నట్లుగా తృప్తినీ, ఆనందాన్ని ప్రదర్శిస్తూ వయ్యారాలు వొలకబోస్తూ ఉంటుంది భవానీదేవి. ఆమె జీవితం విచిత్రం! అందరూ ఆమెని కావాలనుకుంటారు. కానీ ఆమెకి కావలసింది దక్కకుండా పోయింది. ఆమెకథ విషాదం! అందుకే ఆమె తాగుతుంది. అందుకు సమాజం ఆమెని హేళన చేస్తుంది. కక్షతో ఆమె మరీ తాగుతుంది.




ఆమె బాహ్య రూపం వేరు. అంతర్గతమైవున్న కథనం వేరు!!

* * *

ఒదలలేక ఒదలలేక భవానిదేవికి 'గుడ్‌బై' చెప్పి విడిచిపెట్టారు అందరూ. కారు కనుమేర దాటేవరకూ చెయ్యూపుతూ అంతమంది తనకోసం పడి ఛస్తుంటే ఎంతో తృప్తిగా వుంది ఆమెకి. కానీ వెంటనే తనలోని సిసలైన భవానీదేవి గుర్తుకొచ్చి, ఆవేదన మనసు నలుముకుపోయింది? దుఃఖం కట్టలు కట్టలుగా ప్రవహించి, హృదయంలో తుఫాను చెలరేగింది. కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. నిస్సహాయురాలై, భవానీదేవి కారు సీటుకు ఆనుకునిపోయింది.

గేటుముందు కారాగింది. ఖాదర్ డోరుతెరచి "మేడమ్! ఇల్లొచ్చింది." అన్నాడు. "ఆ! అంటూ ఉలిక్కిపడిలేచి కారుదిగింది. వాచ్‌మన్ గేటుతీశాడు. పనిమనిషి తలుపుతీసింది. కారుషెడ్‌లోపెట్టి, ఖాదరు వెళ్లిపోయాడు. భవానీదేవి బట్టలు మార్చుకుని, నైట్‌గౌను వేసుకుని, నగలన్నీ తీసి, అలమారలోపెట్టి మంచి నీళ్లు తాగొచ్చి, మంచంమీద వాలింది, తొందరగా నిద్దర పట్టాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.

నిద్రాదేవి కరుణించలేదు. మనస్సుని ఆలోచనలు చుట్టేసి, ఆవేదనతో చంపేస్తున్నాయి. గతం కళ్లముందు గిర్రున తిరిగి జ్ఞాపకాలు బాకుల్లా గుచ్చుతున్నాయి. ఎంత ఎదురుతిరుగుతున్నా వశం తప్పిన మనసు. గతంలోకే జారుకుంది.

అదే తన పెళ్లిరోజు! ప్రతి వ్యక్తీ కమ్మని కలలలో తేలిపోయేరోజు! ఎర్రటి బనారస్ జరీ పువ్వుల చీరలో, రెండు చేతులకీ ఎర్రగా పండిన గోరింటతో, మల్లెపూల జడతో, పెద్ద కళ్యాణం బొట్టుతో అన్నింటినీ మించిన

సిగ్గుతో తలవంచుకుని కూర్చుని ఊహాలోకంలో తేలిపోతోంది తను.

"ఎంత అందంగా ఉంది గంధర్వ కన్యలా ఉంది" అందొకావిడ. అంతేకాదు సంగీతంలో అపరసరస్వతి. అది చూసే సుందరమ్మ ఈ అమ్మాయిని కోడలిగా చేసుకుంటోంది. సుందరమ్మకి సంగీతం పిచ్చికదూ!" అంది మరొకావిడ. తను మరింత సిగ్గుతో కుంచించుకుపోయింది. తను కోరుకున్నంతవరకూ, కోరుకున్న గురువుల దగ్గర సంగీతాన్ని నేర్పించిన తల్లిదండ్రులకి మనస్సులోనే జోహారులర్పించింది.

భోజనాలయ్యాక సుందరమ్మగారు చుట్టాలందరినీ కూర్చోబెట్టి తనని పాడమంది. సిగ్గుముంచుకొస్తున్నా అవతల వరండాలో ఆయన కూర్చోనుండడం చూసి 'పక్కాలా నిలబడి కీర్తనెత్తుకుంది. 'అద్భుతం' అన్నారందరూ. 'నగుమోమూ, బంటురీతీ, ఎందరో మహానుభావులూ ఇలా ఎవరేది అడిగితే అది పాడింది. సంగీత సరస్వతి తమ ఇంట వెలిసిందని మురిసిపోయింది సుందరమ్మ. ఆమె అదృష్టాన్ని అందరూ కొనియాడారు.

ఆరాత్రి శోభనం గదిలో చైతన్య అన్నమాటలు విని కొయ్యబారిపోయింది. "నీ చదువు నాలుగోక్లాసేగా! భవానీ! నేనా సైంటిస్టుని? అమెరికాలో రీసెర్చికూడా చేస్తున్నాను. ఒక్క అక్షరం ఇంగ్లీషుముక్క రాని నిన్ను అమెరికా తీసుకెళ్లి నాభార్య అని ఎలా చెప్పుకోను! అమ్మమీదుండే నమ్మకంవల్ల, నీఫోటోచూసి ఏ గ్రాడ్యుయేటో అయిఉంటుందనుకొని, నిన్ను చూడకుండా, నీతో మాట్లాడకుండా, ఈ పెళ్లి కొప్పుకున్నాను. కానీ, నీ డిగ్రీ కేవలం సంగీతంలోనేనని, ఈ రోజుదాకా నాకు తెలీదు. సంగీతానికేముంది. మంచి క్యాసెట్లో, రికార్డులో కొనుక్కుంటే, ఎంతసేపయినా వినొచ్చు. కానీ జీవితంలో అందులోనూ అమెరికాలో చదువులేని భార్యతో సంసారం ఎలా చెయ్యను. భవానీ నువ్వు నాతో కాపురం చెయ్యాలంటే చదువుకోవాలి. నేనిప్పుడిప్పుడే ఇండియాకి తిరిగిరాను. నువ్వు ప్రైవేటుగానైనా పరీక్షలు కట్టి డిగ్రీ తెచ్చుకున్నాకే, మనిద్దరం కలసి అమెరికా వెళ్లడం. అంతవరకూ నిన్ను తాకి నీలో కొత్త ఆశలు రేపి దృష్టిని మళ్లించడం నాకిష్టంలేదు. నీ ధ్యాస మనసుఖాలమీదకాక, చదువుమీద లగ్నంచెయ్యి. అంతవరకూ మనం ఇలాగే ఉందాం. మంచంమీద కూర్చుని ఉపన్యాసం ఇస్తున్నాడు చైతన్య.

తన కళ్లు బైర్లుకమ్మాయి. కాళ్లకింద భూమి బద్దలయి తనని ఒడిలో చేర్చుకుంటే బాగుంటుంద నిపించింది. తను కన్న కలలన్నీ పేకమేడల్లా కూలిపోయాయి. పెట్టు కున్న ఆశలన్నీ చెల్లా చెదరై వెక్కిరిస్తున్నాయి. గుండెలమీద వ్రేలాడే మంగళసూత్రం తన కంఠానికి తగిలించిన ఉరితాడులా అనిపించింది. మంచంమీద కూర్చున్న చైతన్య, గొర్రెపిల్లని కొనుక్కుపోతూన్న కసాయివాడిలా అనిపించా డు. తల్లోనిపూలూ, కళ్యాణం బొట్టూ, పాదాల పారాణి, చేతిగోరింట, తననిచూసి పగలబడి నవ్వుతూన్నట్లనిపించింది. కక్షగా అన్నింటినీ పీకి పారెయ్యాలనుకుంది. అంతలోనే కళ్లు చీకట్లు కమ్మి తల తిరుగుతూంటే తూలి కిందపడిపోయింది. పడకుండా పట్టుకున్న చైతన్య స్పర్శ, రంపపుకోతలా అనిపించి, నోటమాటరాక మూగగా మంచంమీద వాలిపోయింది సొమ్మసిల్లి.


కళ్లు తెరిచేసరికి భళ్లున తెల్లవారిపోయింది. అప్పటికే ఇంటిల్లిపాదీ లేచి, సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. తనని చూసి అమ్మా, అత్తగారూ ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ఆ నవ్వులోని భావం గ్రహించిన తనకి, గట్టిగా ఏడవాలనిపించింది. మూగబాధని, బడలికగా, మౌనాన్ని సిగ్గుగా అర్థం చేసుకున్న పెద్దలందరికీ, మనసులోనే నమస్కరించింది. ఇలా వారం రోజులు గడిచిపోయాయి. చైతన్య సెలవు పూర్తయి పోవడంవల్ల, అమెరికా తిరిగి వెళ్లిపోయాడు. గుండె పిండే సంఘటనలని తను గుట్టుగా దాచిపెట్టినా, చైతన్య రాసిన ఉత్తరం అటు అత్తమామల్నీ, ఇటు అమ్మా నాన్నల్నీ కూడా కుప్పగా కూల్చేసింది.

తనకి ట్యూషన్ పెట్టించారు. ప్రైవేట్‌గా మెట్రిక్ పరీక్ష రాయించాలని! కానీ అక్షరం తన బుర్రకెక్కలేదు. అస్తమానం, పిచ్చి పిచ్చి ఆలోచనలు మతి పోగొడుతున్నాయి. చదువు సాగనివ్వడంలేదు. తన తోటివారు, తనతో పాటు పెళ్లయినవాళ్లు పిల్లల తల్లులయి సుఖంగా సంసారం చేసుకుంటున్నారు. తనిప్పుడు పుస్తకాలు ముందేసుకుని కూర్చుంటే, అక్షరాలే తనని చూసి హేళన చేస్తున్నట్టనిపించేది. దాంతో మూడేళ్లు దాటినా మెట్రిక్ కట్టలేదు.

ఆరోజు చైతన్య దగ్గరనుంచి పెద్ద ఉత్తరం వచ్చింది. ఏమిటా అని ఆత్రుతతో విప్పి తండ్రికి చూపించింది. అంతే తనకీ చైతన్యకీ కలసిన ఆ బంధం తను చేసిన సంతకాలతో ముగిసిపోయింది. చైతన్య మళ్లీ పెళ్లిచేసుకున్నాడు.

తనలో ఆవేశం రగిలింది! అహం దెబ్బతింది! పట్టుదల పుట్టుకొచ్చింది? ఒకరకమైన కక్ష ఏర్పడింది. అంతే! ఆ సంవత్సరం మెట్రిక్కు కట్టి, ఫస్టుక్లాసులో పాసయింది. తల్లిదండ్రులు సంతోషించడానికి బదులు దుఃఖించారు. ఇదే పరీక్ష నిరుడు పాసయితే బాగుండేది కదే' అని. తనలోని పట్టుదల ఇంటర్‌కి కూర్చోబెట్టింది. తండ్రి పక్షవాతంతో మంచం పట్టాడు. సంగీతానికి తనకున్న సర్టిఫికెట్టుతో సంగీత కళాశాలలో ఉద్యోగం వేయించాలనుకున్నాడు. కానీ, తను ఆరోజు... పెళ్లిరోజు తరువాత పాడ్తేగా! గొంతుమూగబోయింది. జీవితం [illegible] బారింది. పెద్దచదువులు చదివి ఉద్యోగంచేసి చైతన్యకి బుద్ధిచెప్పాలనుకుంది. అంతే అదొక్కటే ధ్యేయం! అంతే అదొక్కటే లక్ష్యం. అహర్నిశలూ చదివి బి.ఏ.పాసయింది. ఎమ్.ఎ.పాసయింది. జర్నలిజమ్, పబ్లిక్ రిలేషన్స్... ఎన్నో డిగ్రీలు, డిప్లొమాలు.

ఒకరకమైన తృప్తి. ఒకరకమైన గర్వం తనని ఆనందపరచినా, చైతన్యని తలుచుకుంటుంటే ఒళ్లు మండేది. తనని సర్వనాశనం చేసిన కసాయివాడిలా అనిపించేది. 'ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్' అని చైతన్య తనని మరోలా మార్చి ఉండవలసింది. కానీ, తన కలలన్నింటినీ విసిరిపారేసినట్టు శోభనం గదిలో ఇచ్చిన ఉపన్యాసం, తన ఆశలని






నమ్మకం

ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు నారాయణ. యజమాని అతన్ని పిలిచి—

"ఏం ఎందుకని!" అని అడిగాడు.

"నా మీద మీకు నమ్మకం పోయింది సార్" అన్నాడు నారాయణ.

"ఏం జరిగిందని" అడిగాడు యజమాని.

"నిన్నమీరు ఇనప్పెట్టె తాళాలు నాకిచ్చారు. కానీ వాటితో ఇనప్పెట్టె తెరుచుకోలేదు. అవి మారు తాళాలని తెలిసిపోయింది నాకు" చెప్పాడు నారాయణ

—బి.వి.యస్. బాబు (తెనాలి)

ఎంపేసింది. ఆశయాలను మార్చేసింది. ప్రేమమయిగా అనురాగంతో గదిలో అడుగుపెట్టిన తనలో గరళాన్ని నింపాడు చైతన్య.కక్షతో హోదా అయిన ఉద్యోగాన్ని సంపాదించాలనుకుంది. చైతన్యలాగే తనూ మళ్లీ పెళ్లిచేసుకుని అతనికి కన్నుకుట్టేలాగా సంసారం చెయ్యాలనుకుంది.

ఇండియా పొగాకు కంపెనీలో పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా నెలకి ఐదువేల రూపాయల జీతంతో ఉద్యోగంలో చేరింది. ఎన్నో సంస్థలలో సభ్యత్వాన్ని పొందింది. కారు, హోదా, అంతస్థు, అన్నీ సంపాదించింది. నిజానికి ఈ రోజు తను, చైతన్యని మించిన అంతస్థులో వుంది. చైతన్య తల్లిదండ్రులు పోయాక కుటుంబభారం నెత్తిన పడడంతో, ఇండియాకి తిరిగొచ్చి యూనివర్శిటీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్నాడు. నలుగురు పిల్లలు. భార్య స్కూలు టీచరు. బి.ఎ.బి.ఇడి. చదివింది. వందలమంది ప్రొఫెసర్లలో చైతన్య ఒకడు! కానీ తారాస్థాయి నందుకున్న అతికొద్దిమంది మహిళలలో

'భవానీదేవి. ఒకరు' అంటే తనొకర్తె! తలుచుకుంటే నవ్వొచ్చింది భవానికి. అంతలోనే ఆమెలోని పగ బుసలుకొట్టింది. ఈ సంఘమన్నా సమాజం అన్నా అసహ్యం ముంచుకొచ్చింది.

తల బద్దలయిపోతూ వుంటే, లేచి వెళ్లి, మంచినీళ్లు తాగొచ్చి, తల రుద్దుకుంటూ మంచంమీద వాలిపోయింది. ఎందుకనో, ఎంత ప్రయత్నించినా నిద్దరనేది రావడంలేదు. మనసు మళ్లీ గతాన్నే తవ్వుతోంది.

తను ఎన్నోసార్లు, తగినవాళ్లెవరైనా దొరికితె పెళ్లిచేసుకోవాలనుకుంది. కానీ, తను అదివరకే వివాహితురాలని తెలుసుకున్నవాళ్లందరూ పునర్వివాహం చేసుకుంటానన్నతనని ఇష్టపడలేదు. కానీ, ప్రతీవాడికీ తను కావాలి. తన అందాన్ని కళ్లతో తాగేస్తూ, తన యౌవనాన్ని కొరికి తినేసేలా ప్రతీవాడూ చూస్తాడు. అంతేకాదు విడాకులందుకున్నందుకు, విలాసాలకూ కులాసాలకు సులభంగా దొరికే వ్యక్తిలా అందుకోవాలని ఆశిస్తారు. పెద్దవాళ్లలా, మర్యాదస్తుల్లా ఫోజులుపెట్టే మగవాళ్ళు సయితం తమ భార్యలను పవిత్రమైన వారిలా, భద్రంగా చూసుకుంటూ, కాలక్షేపానికి, సరదాలు తీర్చుకోవడానికీ, ఇతరులను వాడుకోవాలని చూడడం, మగవాళ్లంటేనే అసహ్యాన్ని కలిగించింది తనకి? తనని చేరువ కావాలని కోరుకునే మగవాడిని, పెళ్లిచేసుకోమని అడిగితే, కనిపించకుండా వెళ్లిపోయిన సంఘటనలన్నీ కళ్లముందు తిరిగి వారి రూపాలు వికృతంగా కదలాడాయి.

తల బద్దలయి పోతున్నా ఆలోచనలు ఆగడంలేదు. సన్నటి తువ్వాలుతో తలమీద గట్టిగా కట్టుకుంది. నిద్దరపోవడానికి అటూఇటూ తిరిగి పడుకుని ఎంత ప్రయత్నించినా వృధా అయిపోయింది.

'రెండోపెళ్లి చేసుకున్న చైతన్యకి అభ్యంతరం లేదు. తను రెండోపెళ్లి చేసుకుంటానంటే, ఏ మగాడూ ముందుకు రాలేదు సరికదా, ఆడవాళ్లు చెవులు కొరుక్కున్నారు. హేళనగా చూశారు. అందుకనే తనకి మగవాళ్లంటే కక్ష. ఆడవాళ్లంటే అసహ్యమూ పట్టుకున్నాయి. ఈ సమాజానికి కావలసిన అంతస్థు, హోదా, డబ్బు అంతా గడించింది తను. ప్రతివాడినీ ఆకర్షించి, అతను తన పొందుకోసం తహతహలాడుతూంటే, తప్పుకుని, అతనిలోని ఆవేదనను చూసి ఆనందించే రాక్షసిగా మారిపోయింది తను. ఆడవాళ్లు తన అంతస్థుని చూసి అసూయపడుతూంటే సంతోషించే, రక్కసిలా మారిపోయింది తను! ప్రేమన్నా పెళ్లన్నా చలించని పాషాణురాలిగా మారిపోయింది తను! ఈ మార్పుకి కారణం ఎవరు! తనలోని ఈ పరిణామానికి బాధ్యులెవరు! ఎవరు! ఎవరు! తనా! చైతన్యా! తనూ చైతన్యలాగే పెళ్లిచేసుకుని బ్రతకడానికి ఆస్కారం కల్పించని ఈ సమాజమా! ఎవరు! ఎవరు!

తల బద్దలైపోతూంది. సమాధానం దొరకడంలేదు. భరించలేని బాధతో, తీరని ఆవేదనతో దుఃఖాన్ని ఆపుకుంటూ, నిద్దరకోసం, రెండు మాత్రలు మింగి, మళ్లీ వచ్చి మంచంమీద వాలిపోయింది. ఉదయం ఎనిమిదింటికి పేపరుబోర్డు మీటింగ్‌ని గుర్తుచేసుకుంటూ. గడియారం ఠంగుఠంగున మూడుగంటలు కొట్టింది. అప్పుడే భవానీదేవికి కాస్త కళ్లంటుకున్నాయి మాత్రలు పనిచేసాయో, మనసు కుదుటపడిందో, కాలం దయతలచిందో!!


సకుటుంబంగా
చదువుకోడానికి
చక్కని కాలక్షేపానికి
ఆంధ్రభూమి
సచిత్ర మాస పత్రిక



నూతన యవ్వనం పొందండి
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత. శీఘ్రస్ఖలనము అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి. సంతానము లేకపోవుట. సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స, పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: ప్రతి ఆదివారం భీమవరం. షణ్ముఖలాడ్జి నందు ఉ॥ 9 గం॥ నుండి సా॥ 6-30 గం॥ వరకు ప్రతినెల 1, మరియు 16, తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సర లో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు.

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేద బిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ-521 301
ఫోన్స్: 522 అండ్ 540